# నేటి రేనాడు

శ్రీ కె. డి.

ప్రక్కడొక యుద్ధం జరుగుతూంది. యుద్ధం – పెద్ద ఆయుధాలేవీ లేకున్నా, మోటుశస్త్రాలు చాలా ఉపయోగింప బడుతున్నై. ఇరువైపులా తీవ్రంగా గాయపడుతున్నారు. రెడ్లు మీసాలు మెలి త్రిప్పి హుంకరిస్తున్నారు. నేటి అన్ని యుద్ధాలవలె యిది అధర్మయుద్ధం కాదు. కలియుగంలో కూడా ధర్మయుద్ధం జరుగుతుం దనటానికి అదొక ఉదాహరణము – అది రేనాటి సీమ.

యుద్ధానికి ప్రబలమైన కారణాలేవీ లేవు. అతిపురాతనకాలంనుండి ఆ గ్రామములో ఒక చిన్న కాలువ పారుతూంది. దానిక్రింద దాదాపు నూరు యకరాల మాగాణి సాగౌతుంది. ఆ మాగాణిని ఆ కాలవను హక్కుభుక్తంగా అనుభవిస్తున్న పలువురు రైతులలో పుల్లారెడ్డి, రామిరెడ్డి ప్రముఖులు. మట్టరికాలు వీరిద్దరూ బావా, మరదు లౌతారని తెలుపుతాయి.

సాధారణంగా వర్షకాలంలో ఆ కాలవ నీటితో నిండినప్పటికీ వేసవిలో అది కొద్ది నీటిని మాత్రం ఉంచుకుంటుంది. ఆ నీటిని వంతులప్రకారం రైతులు ఉపయోగించుకుంటారు.

ఒకనాటిరాత్రి – ఆ దినం పుల్లారెడ్డి వంతు – రామిరెడ్డి తన మనుష్యులచేత నీటిని పుల్లారెడ్డి భూమికి పారకుండా తన భూమికి పారబెట్టించినాడు. మరుసటి రోజు యీ సంగతి పుల్లారెడ్డి తెలుసుకొన్నాడు.

మరుసటి రాత్రే పుల్లారెడ్డి తన మనుష్యులను యిద్దరిని పంపించినాడు రామిరెడ్డి నీటిని తన భూమికి త్రిప్పటకోసం. ఇంతకు ముందే ఆయుధాలు చేతబట్టి సిద్ధంగా ఉన్న రామిరెడ్డి అనుచరులు వాళ్లను తన్ని తరిమినారు.

అసలే అవమానంచేత భగ్నమంటున్న పుల్లారెడ్డి హృదయం – గోరుచుట్టుపై రోకటి పోటన్నట్టు – యింకొక కారణంచేత పూర్తి భగ్నమైంది. అది – పుల్లారెడ్డి పశువులను నిష్కారణముగా రామిరెడ్డి బందెకు తోలటం.

అయితే పుల్లారెడ్డి తన మనుష్యుల సహాయంతో యింతకు మించిన పనిచేసి కూర్చున్నాడు. రామిరెడ్డి పెద్ద పుంజుకోడిని రహస్యంగా ముగించినాడు. రామిరెడ్డి చేలో ప్రత్తిని బహిరంగంగా తన కూలీలతో కోయించినాడు.

రాజుతో దేశంవలె రెడ్లతో హరిజనవాడ రెండుగా చీలిపోయింది. రెండు రాజ్యాలు కొట్లాడితే మధ్య నష్టపడే ప్రజలవలె యీ యిరువురు రైతు ప్రముఖులు కొట్లాడగా మధ్య హరిజనులు కష్టపడబోతున్నారు.

మొత్తం గ్రామంలోని ఆబాలగోపాలము యిరువైపుల సానుభూతి పరులుగా చేరుతున్నారు. ప్రత్యక్షంగాను పరోక్షంగాను తమపక్ష అధినేతలకు సాయపడుతున్నారు.

గ్రామమునసబు మాత్రము తెలివిగలవాడనే చెప్పాలి. ఇరువైపులవారికీ "పోరు నష్టము, పొందులాభము" అను సూక్తిని విశదము చేసినాడు. ప్రయోజనం శూన్యం కాగా దగ్గరి పోలీస్ స్టేషనుకు తలారిచే వార్తను పంపినాడు. గ్రామాధికారి అధికారుల బధిరత్వమును గమనించలేదు. ఎట్లు గమనిస్తారు ?

అగ్నికి అన్ని వస్తువులు సమకూరినాయి. ఇక అగ్గిపుల్ల ఒక్కటే తక్కువ. ఆనాటి రాత్రి ఊరంతా పరశురామప్రీతి కౌతున్నది. చుట్టుపక్కల ఊర్లలోని సంగతెరుగని చూపరులకు అది ఒక దవానల మనిపించింది. కాని ఊళ్లో ప్రజకు – ఏ కొద్ది మందికో తప్ప – ఏవిధమైన చింతా లేదు. కాగా వారంతా ఉత్సాహంగా ఉన్నారు.

అది జరిగింది నిన్నటిరాత్రే ఇదుగో! యీరోజు జరుగుతూంది ప్రత్యక్షయుద్ధం. పిల్లలు, పెద్దలు, యువకులు – యిరువైపులా ఉన్నారు. చుట్టు పల్లెలనుండి రోజు కూటూ వస్తున్నారు, యిరుపక్షముల సానుభూతిపరులు. ఇదిగో! యుద్ధము ప్రబలింది. పుల్లారెడ్డి ముఖ్యానుచరుడు రామప్ప పడి మరి లేవలేదు. యిప్పటికి చనిపోయి ఉంటాడు. పుల్లారెడ్డి కత్తిగట్టిన కోడివలె శివమెత్తినట్లు పోరాడుతున్నాడు – కొడవలితో రామిరెడ్డి కొడుకును యీలోకం నుంచి శాశ్వతంగా పంపించినాడు – ఘోరం – కొడుకుతోపాటు తండ్రిని కూడా పంపినాడు –

నాయకుడు పోవడంతో సైన్యం చెల్లాచెదరైంది. గ్రామం శాంతించింది. కాని అది మళ్లీ గ్రామమౌతుందా? గెలిచిన జట్టు ఎవరింట్లకు వాళ్లు విజయనాదాలతో పోతున్నారు. ఏమి కాబోతుందో ?

అదుగో! యిప్పుడు వస్తున్నారు పోలీసుమహాశయులు. పలుగుర్ని పట్టి సంగతంతా కనుక్కున్నారు. అభియోగమును ఆపాదించినారు.

మరి వీరి భవిష్యత్తు యెట్లుంటుందో ఏమవుతుంది ? యిరువైపుల ప్రముఖులు పెద్ద పెద్ద (అ) న్యాయవాదుల్ని నియమించుకోబోతారు. స్వార్జితమో, పిత్రార్జితమో అయిన నాలుగురూపాయలను ప్రభుత్వానికి, న్యాయవాదులకు అర్పించుకోబోతున్నారు. నిజంగా దాతట!

సాధ్యమైనంత వరకు శిక్ష తప్పించుకోవటానికే ప్రయత్నిస్తారు. శిక్ష విధించబడితే అనుభవిస్తారు. ఇంతకంటె ఏం చేస్తారు ?

ఏమైనా వారు వారికే కాక తమ గ్రామానికి, తద్వారా తమ దేశానికే తీరని నష్టం తెచ్చారు. మళ్ళీ యీ గ్రామాన్ని యే ఉద్ధారకుడు ఉద్ధరిస్తాడో ?

దీనికి మూలకారణ మిప్పు డందరికీ బాగా తెలుసు (1) స్వాభిమానం (2) ధనగర్వం అంతేనా ?

★


## రు. 100 బహుమానం

(గవర్నమెంటు రిజిష్టర్డు)

తెల్లవెంట్రుకలను అంత మొందించండి రంగులు వాడకండి. మా ఆయుర్వేద సువాసన "సెంట్రల్ మోహిని ఆయిల్" 60 ఏళ్లదాకా నల్లగా ఉంచును. ఇది మీ దృష్టిని వృద్ధిపరచి తల నొప్పిని కుదుర్చుతుంది. కొన్ని వెంట్రుకలు తెల్లబడితే రూ. 2-8-0 తో ఒక సీసా (మూడు ఒకసారి 6-8-0) కొనండి. హెచ్చుగ తెల్లబడితే 3-8-0 (మూడు ఒకసారి 9-0-0.) తలంతా తెల్లబడితే రు. 5-0-0 (మూడు ఒకసారి రు. 12) కొనండి. ఇది అబద్ధమని ఋజువుచేసిన వారికి రు. 100 బహుమానం. పూర్తి విశ్వాసానికి అణాన్నర స్టాంపు పంపి గ్యారంటీ తీసుకొనండి.

**Bharat Kalyan Aushadhalaya.**

Post Bag No 6725, Calcutta. (A P)